మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# అకాల వర్షం..

# అన్నదాతలకు నష్టం..!

**- నవాబుపేట, జడ్చర్ల మండలాల్లో అత్యధిక వర్షపాతం - 60ఎకరాల్లో వరి, మొక్కజొన్న పంటనష్టం**

**మహబూబ్‌నగర్‌ప్రతినిధి,ఏప్రిల్ 26,ప్రభాతవార్త:** అకాల వర్షం అన్నదాతలకు నష్టాన్ని మిగిల్చింది. మంగళవారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి అతలాకుతలం అయింది. పలుచోట్ల రోడ్లపై నీళ్లు చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నెల రోజుల వ్యవధిలోనే మూడుసార్లు అకాల వర్షాలు కురియడంతో అన్నదాతలు తీవ్ర నష్టం వాటిల్లింది. వరితోపాటు, మొ క్కజొన్న, మిర్చి రైతలకు తీరని వ్యథ మిగిలింది. నష్టపోయిన పంటలకు పరిహారం అందించాలని అన్నదాతలు వేడుకుంటు న్నారు. జడ్చర్ల, మహబూబ్‌నగర్ పట్టణాల్లో కొన్ని ప్రాంతాల్లో ఇండ్లలోకి వర్షపు నీరు చేరింది. జడ్చర్ల చౌరాస్తాలో ఇండ్లలోకి నీళ్లు చేరడంతో రోడ్డుపైకి వచ్చి ధర్నా చేశారు. దీంతో ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

**అధికారుల పరిశీలన..**

పంటనష్టంపై వ్యవసాయ అధికారులు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. ఈమేరకు బుధవారం జడ్చర్ల, నవాబుపేట మండలాల్లో పర్యటించారు. 41 ఎకరాల్లో వరి, 14.3 ఎకరాల్లో మొక్క జొన్న పంటనష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనాకు వచ్చారు. క్షేత్ర స్థాయిలో గ్రామాల్లో పర్యటించి పంటనష్టం అంచనా వేయనున్నారు. అనంతరం ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు మహబూబ్‌నగర్ జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్ తెలిపారు.



జడ్చర్లలో ఇండ్ల మధ్య చేరిన వర్షపు నీరు



నష్టపోయిన పంటను పరిశీలిస్తున్న డీఏవో వెంకటేశ్

| మండలం | వర్షపాతం( మి.మీ.) | మండలం | వర్షపాతం( మి.మీ.) | మండలం | వర్షపాతం( మి.మీ.) |
|---|---|---|---|---|---|
| సీసీ కుంట | 33.2 | దేవరకద్ర | 38.0 | నవాబుపేట | 26.0 |
| కోయిలకొండ | 23.4 | అడ్డాకుల | 18.0 | బాలానగర్ | 31.4 |
| గండీడ్ | 30.2 | మూసాపేట | 47.6 | రాజాపూర్ | 29.6 |
| హన్వాడ | 15.2 | భూత్పూర్ | 71.0 | జడ్చర్ల | 48.2 |
| మహబూబ్‌నగర్ రూరల్ | 23.0 | మహబూబ్‌నగర్ అర్బన్ | 41.0 | మిడ్జిల్ | 78.2 |
| | | | | మహ్మదాబాద్ | 17.8 |

## జోగులాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా..

**అకాల వర్షంతో పొంగి పొర్లిన వాగులు**

**చేతికొచ్చిన పంట వర్షార్పణం**

**నందిన్నెలో ఇండ్లలోకి చేరుకున్న వర్షపునీరు**

**నేలరాలిన మామిడి**

**పిడుగుడపి రెండు ఆవులు మృతి**

**కెటిదొడ్డి మండలంలో అత్యధిక వర్షపాతం నమోదు**

జోగులాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా బుధవారం తెల్లవారుజా మున అకాల వర్షాలు బీభత్సం సృష్టించాయి. చేతికొచ్చిన పంట వర్షార్పణం అవడంతో కన్నీటి పర్యంతమవుతున్నారు. రైతులు వరి,మామిడి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడడంతో వాగులు పొంగిపొర్లాయి. ఈదురుగాలులు, భారీ వర్షానికి పంట పొలంలో ఉన్న వారి చేనులో గింజలన్ని నేలపాలయ్యాయి. గాలి దుమారానికి మామిడి పంట నేలరాలడంతో రైతులు లబోదిబోమంటున్నారు. జోగులాంబ జిల్లాలోని ఆయా మండలాల వారిగా నమోదైన వర్షపాతం కెటిదొడ్డి 80.1 ఎంఎం, ధరూర్ 14.7 ఎంఎం, గద్వాల 8.6, ఇటిక్యాల 8.1, మల్దకల్ 15.3, గట్టు 38.5,ఐజ 19.3, రాజోలి 00, వడ్డేపల్లి 21.0, ఉండవెల్లి00, అలంపూర్ 10.8ఎంఎంగా నమోదైంది.



అకాల వర్షానికి నేలరాలిన మామిడి



పిడుగుపడి ఆవుల మృతి చెందిన దృశ్యం



ఇళ్లలోకి నీరు చేరడంతో ఎత్తిపోస్తున్న మహిళ



పిడుగుపడి గెదె మృతి



నీటిని ఎత్తిపోస్తున్న రైతులు

## అకాల వర్షంతో 60 ఎకరాల్లో వరి పంట నష్టం...



నగరగడ్డ తాండలో దెబ్బతిన్న పంట వివరాలు సేకరిస్తున్న ఏఓ మంజుల

**వెల్దండ, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** అకాల వర్షంతో 60 ఎకరాల్లో పంటనష్టం వాటిల్లినట్లు తహసీల్దార్ చంద్రశేఖర్, ఏఓ మంజులలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని భైరాపూర్, చెర్కూర్, అజిలాపూర్, చెదురుపల్లి పంచాయతీల్లోని గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలకు 60 ఎకరాల పంట నష్టం వాటిల్లినట్లు తహసీల్దార్ చంద్రశేఖర్, ఏఓ మంజుల పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలో 50.06 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందన్నారు. గురువారం వ్యవసాయాధికారిణి మంజుల ఏఈఓలతో కలిసి పంటనష్ట ప్రాథమిక వివరాలను సేకరించి జిల్లా వ్యవసాయ కార్యాలయానికి పంపించినట్లు తెలిపారు.

## రెక్కల కష్టం.. వర్షార్పణం..!

**- దేవరకద్ర మార్కెట్‌యార్డులో తడసిపోయిన ధాన్యం**

**- ఆందోళనలో అన్నదాతలు**

**- ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వినతి**



దేవరకద్ర మార్కెట్‌యార్డులో తడచిన ధాన్యం బస్తాలు

**దేవరకద్ర,ఎప్రిల్ 26 ప్రభాతవార్త:** ఒక్కసారిగా ఉరుములు.. మెరుపులు..ఈదురుగాలులలో కూడిన వర్షం కురవడంతో రైతులు కలవరానికి గురయ్యారు. మేఘావృతమైన ఆకాశం.. ఈదురుగాలులు భీభత్సం సృష్టించాయి. ఆరుగాల కష్టపడి పండించిన వరిపంట కళ్ళెదుటే పాడవుతుంటే రైతన్న ఆశలు అడియాశలయ్యాయి. దేవరకద్రలో మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి వరిధాన్యానికి అపారనష్టం వాటిల్లింది. దీంతో అన్నదాతలు అందోళన చెందుతున్నారు. చేతికొచ్చిన పంట చేయిదాటుతుంటే రైతన్న విలవిలలాడిపోయాడు. పగబట్టిన పకృతిని చూసి నివ్వెరబోయాడు. తాము ఎదుర్కొంటున్న అదృష్టపరిక్షను ఎలా అదిగమించాలోనని ఆలోచిస్తున్నాడు.

**దేవరకద్ర మార్కెట్‌యార్డులో తడసిపోయిన ధాన్యం..**

దేవరకద్ర మార్కెట్‌యార్డులో మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి రైతులు విక్రయానికి తీసుకవచ్చిన దాన్యం తడసి పోయింది. దీంతో రైతులకు నష్టంవాటిల్లింది. సీజన్ కావడంతో మార్కెట్‌యార్డుకు రైతులు విక్రయానికి ప్రతిరోజు 3వేల కింటాళ్ళకు పైగా సోన, 2వేలకు పైగా హంస ధాన్యాన్ని రైతులు తీసుకవస్తున్నారు. అయితే మంగళవారం కూడ రైతులు ఎప్పటిలాగానే విక్రయానికి వరిధాన్యాన్ని తీసుకవచ్చారు. తెచ్చిన ధాన్యాన్ని రైతులు యార్డులో ఆరబెట్టారు. అయితే ఒక్కసారిగా వర్షం రావడంతో ఆరబెట్టిన ధాన్యం తడచిపోయింది. కోనుగోలు చేసిన ధాన్యం సైతం తడసిపోయింది. వర్షం ధాటికి ధాన్యం నీటిలో కొట్టుకుపోయింది. దీంతో రైతులు మనోవేదనకు గురయ్యారు. వర్షం ధాటికి నష్టపోయిన వరిపంట రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

**ఆందోళనలో రైతులు..**

దేవరకద్ర మండలంలోని మళ్ళీ ఎక్కడ వర్షం వస్తుందేమోనని ఆందోళన చెందుతున్నారు. చేతికి వచ్చిన పంటకు వర్షం వల్ల ఎక్కడ నష్టం వాటిల్లుతుందోనని భయపడుతున్నారు. మండలంలో దాదాపు 16వేల7వందల98ఎకరాలలో రైతులు వరిని సేద్యం చేశారు. అయితే దాదాపు 70శాతం పంటను రైతులు కోశారు. అయితే ఆయాగ్రామాలలో ఇంకా వరిపంటను రైతులు కోస్తున్నారు. చాలా చోట్ల కల్లాల్లోనే వరిధాన్యం నిల్వఉంది. వర్షం కారణంగా గ్రామాలలో వరిపంటకు నష్టం వాటిల్లింది.

## వర్షంతో నష్టపోయిన వారిని ఆదుకోవాలంటున్న రైతన్నలు..

**నారాయణపేట ప్రతినిధి,ఏప్రిల్ 26 ప్రభాతవార్త :** జిల్లా వ్యాప్తంగా మంగళవారం రాత్రి వడగండ్లు, ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా రాత్రి 10 గం.లనుండి తెల్లవారుజామున 3 గం.లకు పెద్ద ఎత్తున వడగండ్లతో కూడిన వర్షం కురిసింది. ఈ వడగండ్ల వానతో రైతన్నలు కుదేలయ్యారు. ఈదురు గాలులతో భారీ వర్షం కురవడంతో చేతికొచ్చిన వరిపంట పూర్తిగా నష్టపోయిందని వర్షం కురవంతో పంటలు మొత్తం నేలవాలాయని రైతన్నలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. వ్యవసాయ అధికారులతో, తహసిల్దార్‌లతో గ్రామాలలో పర్యటించి నష్టపోయిన రైతుల జాబితా సేకరించి ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. దామరగిద్ద, నారాయణపేట, మక్తల్ మండలాలలో భారీ వర్షం కురవడంతో వర్షపు నీరు పంట పొలాలలోకి చేరడంతో రైతులు ఇబ్బందులకు గురయ్యారు. జిల్లా కలెక్టర్ రైతుల పక్షపాతి అని జిల్లా కలెక్టర్ వచ్చిన తర్వాత జిల్లా వ్యాప్తంగా అక్రమాలపై ఉక్కుపాదం మోపారని అలాంటి కలెక్టర్ రైతులపై కనికరం చూపి ప్రతి గ్రామంలో నష్టపోయిన రైతుల పంట జాబితా వివరాలు సేకరించి రాష్ట్ర ప్రభుత్వంచేత తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.





నీటి మునిగిన పంట పోలాలు

**జిల్లాలో మండలాల వారిగా కురిసిన వర్షపాతం వివరాలు..**

జిల్లా వ్యాప్తంగా మంగళవారం అర్థరాత్రి నుండి పెదనద ఎత్తున వడగండ్ల వాన కురిసింది. జిల్లా వ్యాప్తంగా దామరగిద్ద మండలంలో 75.4, నారాయణపేట 76.4, ఉట్కూర్ మండలంలో 32.8, మాగనూరు మండలంలో 30.2, మక్తల్ మండలంలో 69.0, నర్వమండలంలో 24.6, ధన్వాడ మండలంలో 42.2, మద్దూరులో మండలంలో 58.0, కోస్గి మండలలో 31.0గా వర్షపాతం నమోదైంది. నారాయణపేట జిల్లా కేంద్రంలో అత్యధికంగా 76.4, అత్యల్పంగా నర్వ మండల కేంద్రంలో 24.6 వర్షపాతం నమోదయిందని జిల్లా అధికారులు తెలిపారు.

## ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు సమాయత్తం కావాలి...

**-ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్**



వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** వచ్చేసార్వత్రిక ఎన్నికలను పకడ్భందిగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల అధికారులు సమాయత్తం కావాలని ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల సన్నద్ధతపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సమర్ధవంతంగా పనిచేసే రెవెన్యూ అధికారుల పేర్లను రిటర్నింగ్ అధికారులుగా గుర్తించి జాబితాను పంపించాలని కలెక్టర్లను సూచించారు. జూన్ 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభం కానున్న ఎఫ్.ఎల్.సీ నిర్వహణకు కావాల్సిన మౌళిక సదుపాయాలు సమకూర్చుకోవాలని తెలిపారు. ఈ.వి.యంలు, వీవీ ప్యాట్‌లకు ఫస్ట్ లెవల్ చెకింగ్, పొలిటికల్ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిర్వహించాల్సి ఉంటుందని, అవసరమైన స్థలం, ఇంటర్నెట్, సీసీ కెమెరాలు, వీడియో కవరేజ్ చేయాల్సి ఉంటుందన్నారు. ఈ.వి.యం గోదాంకు దూరంగా ఎఫ్.ఎల్.సీ నిర్వహించాల్సి వస్తే ఈ.వి.యం తరలించడానికి జి.పి.ఎస్ సిస్టం ఉన్న వాహనాలను ఉపయోగించాలన్నారు. స్టేట్ లేవల్, డిస్ట్రిక్ లెవల్ మాస్టర్ ట్రైనర్‌లను గుర్తించి శిక్షణ నిమిత్తం వారి పేర్లను వారం రోజుల్లో పంపించాల్సింది గా ఆదేశించారు. ఏప్రిల్ 1 నుంచి ప్రామాణికంగా చేసుకొని దరఖాస్తు చేసుకున్న నూతన ఓటర్ల నమోదు ధరఖాస్తులను ఏప్రిల్ 30లోగా పరిష్కరించాలని సూచించారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ ఇప్పటికే రిటర్నింగ్ అధికారులు జాబితా పంపించడం జరిగిందని, ఒకేఇంటి నుంచి 6 అంతకన్న ఎక్కువ ఓటర్లు నమోదు అయిన వివరాలు నియోజకవర్గ స్థాయిలో పంపించి తగిన విచారణ చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నియోజకవర్గ స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రతి వారం సమావేశం ఏర్పాటు చేసే విధంగా ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ మోతిలాల్‌నాయక్, ఆర్డీఓలు పాండునాయక్, హన్మనాయక్, సూపరింటెండెంట్ రవికుమార్ తదితరులు ఉన్నారు.

## ప్రతి ఊరు, ప్రతి గడపకు బీఆర్ఎస్ సంక్షేమ పథకాలు..

**కేసీఆర్ నాయకత్వంలో గ్రామాల స్వరూపమే మారిపోయింది..**

**దేశంలో ఏ రాష్ట్రం కూడా తెలంగాణ అభివృద్ధికి సాటిరావు..**

**కేంద్రం ఇచ్చిన అవార్డులే ఇందుకు నిదర్శనం..**

**పల్లెనిద్రలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి.**



పల్లెనిద్రలో పర్యటిస్తున్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**వనపర్తి ప్రతినిధి,ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి గడపకు, ప్రతి ఊరికి బీఆర్ఎస్ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. వనపర్తి మండలం అప్పాయిపల్లి, గుంత తాండా లో మంగళవారం రాత్రి ఆయన పల్లెనిద్ర కార్యక్రమాన్ని చేపట్టారు. రాత్రి అక్కడే తాండాలో బస చేసి తాండా వాసులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. బుధవారం ఉదయం తాండాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా తాండా వాసులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలో తాండాలు, గ్రామాల స్వరూపమే పూర్తిగా మారిపోయిందని, అభివృద్ధి పథంలో గ్రామాలు పరుగులు పెడుతున్నాయని ఆయన అన్నారు. దేశంలో ఏ రాష్ట్రం కూడా తెలంగాణ అభివృద్ధితో పోటీ పడడం లేదని మంత్రి తెలిపారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చిన అవార్డులే నిదర్శనమి మంత్రి పేర్కొన్నారు. అప్పాయిపల్లి నుండి గుంత తాండా వరకు 3.5కిమీ బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.2.5 కోట్లు మంజూరు కాగా మంత్రి స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. అప్పాయిపల్లి డబుల్ బెడ్ రూం ఇళ్లవద్ద రూ.20లక్షలతో నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రానికి మంత్రి భూమి పూజ చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రణాళికబద్ధంగా కొనసాగిస్తున్న పరిపాలనతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, వైకుంఠదామాల నిర్మాణంతో గ్రామాల్లో ఉన్న సుదీర్ఘ సమస్య తొలిగిపోయిందని, సీసీ రహదారులు, డ్రైనేజీల నిర్మాణంతో గ్రామాల్లో మురుగునీటి బాధ తప్పిందని, పరిశుభ్రతకు, పచ్చదనానికి తెలంగాణ పల్లెలు ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ వైస్ చైర్మెన్ వాకిటి శ్రీధర్, మార్కెట్ కమిటీ ఛైర్మెన్ రమేష్ గౌడ్, సింగిల్‌విండో అధ్యక్షుడు వెంకట్‌రావు, తహసిల్దార్ రాజేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాధికారం దిశగా ముదిరాజ్‌లు అడుగులు వేయాలి...

**- కేంద్రం రూ.20 కోట్లతో మత్స్యశాఖ ఏర్పాటు...**

**- నా జాతి అభ్యున్నతి కోసం నిరంతరం పోరాడుతా...**

**- హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్**



సమావేశంలో మాట్లాడుతున్న ఈటెల రాజేందర్

**కల్వకుర్తి,ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** ముదిరాజ్ యువకులు చైతన్యంతో రాజ్యాధికారంకై అడుగులు వేసి ముదిరాజ్ బిడ్డలను ఏకం చేయాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ సూచించారు. బుధవారం కల్వకుర్తి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు పెద్దేటి నిరంజన్, తాలూకా అధ్యక్షులు పుట్ట శేఖర్‌ల అధ్యక్షతన నిర్వహించిన ముదిరాజ్ బహిరంగ మహాసభకు హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్, కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, జాతీయ మాజీ ఓబీసీ కమీషన్ సభ్యులు తల్లోజు ఆచారిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈటెల రాజేందర్ మాట్లాడుతూ ముదిరాజ్‌ల కులవృత్తి మత్స్య పెంపకానికి రూ.20 కోట్లతో మొట్ట మొదటిసారిగా ఏర్పాటు చేసిన ఘనత ప్రధాని మోడీకి దక్కిందన్నారు. ఎన్నో ఏళ్లుగా ముదిరాజ్‌లను ఓటు యంత్రాలుగా వాడుకొని ఎన్నికల్లో గెలుపొంది ముదిరాజ్ కులస్థులను రోజు రోజుకు అన్యాయానికి గురిచేస్తూ ముదిరాజ్‌లకు మనుగడ లేకుండా చేస్తున్నారని, ముదిరాజ్ యువకులు చైతన్యపరులై తన జాతిని కాపాడుకునేందుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఎస్సీ, బీసీ కులాల్లో ముదిరాజ్, గొల్ల కుర్మలు అత్యధికంగా ఉన్నారని, వారు ఐక్యతగా ఉంటే రాజ్యాధికారాన్ని దక్కించుకునే సత్తా ఉందన్నారు. ముదిరాజ్‌లకు ఎక్కడ అన్యాయం జరిగిన అక్కడికి చేరుకొని నా జాతికి అన్యాయం జరగకుండా కాపాడుకుంటానన్నారు. ప్రతి ముదిరాజ్ ముదిరాజ్ సంఘంలో సభ్యుత్వాలు తీసుకుంటేనే ప్రభుత్వ పథకాలకు అర్హులవుతారన్నారు. 9 సామ్రాజ్యాలను పాలించిన సామంత రాజులు ముదిరాజ్‌లని, అనాడు రాజులుగా బ్రతికిన ముదిరాజ్ బిడ్డలు, నేడు అన్యాయానికి గురై తిండికి లేక అవస్థలు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. రానున్న కాలంలో ముదిరాజ్‌లు ఐక్యతను చాటి

– మిగతా4లో..


## కంపెనీలు ఆర్గనైజర్లు సమన్వయంతో రైతులకు నాణ్యమైన సీడ్ అందించాలి:జిల్లా కలెక్టర్



సీడ్ కంపెనీ ప్రతినిధులు, ఆర్గనైజర్లతో మాట్లాడుతున్న కలెక్టర్

**గద్వాల ప్రతినిధి,ఏప్రిల్26 ప్రభాతవార్త:** ఖరీఫ్‌సీజన్‌లో పత్తివేసి రైతులు నష్ట పోకుండా, సమస్యలు రాకుండా చూడాలని జిల్లాకలెక్టర్ వల్లూరు క్రాంతి సీడ్ కంపెనీ ప్రతినిధులు, ఆర్గనైజర్లను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశహాలులో వ్యవసాయాధికారులు, సీడ్ కంపెనీ, ఆర్గనైజర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కంపెనీలు, ఆర్గనైజర్ సమన్వయంతో రైతులకు నాణ్యమైన సీడ్ అందించేందుకు ప్లాన్ ఉండాలని, మీ ప్రొడక్షన్‌ప్లాన్ సంబంధిత శాఖకు తెలపాలని ఏరైతు ఎన్ని ఎకరాలలో ఎంత సీడ్ వేస్తారనే సమాచారం ఉండాలన్నారు. ఫెయిల్ అయిన సీడ్ వివరాలు ప్రతిరైతు మొబైల్ నంబర్ తీసుకుని సమాచారమివ్వాలని తెలిపారు. ఆర్గనై జర్‌లు అగ్రిమెంట్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. కమిటి ఏర్పాటు చేసి ఇన్స్పెక్షన్ చేసి ఫెయిల్యూర్ సీడ్‌కు సంబంధించి విడియోగ్రఫీ, ఫొటోలు తీసి రైతులకు అందించాలని సూచించారు. గట్టు, కెటిదొడ్డి మండలాలకు సంబంధించి విద్యలో చాలా వెనుకబడి ఉన్నందున చైల్డ్ లేబర్‌ను వాడకూడదని తెలిపారు. పిల్లలకు మంచి విద్యను అందించే విధంగా అందరు సహకరించాలన్నారు. శాఖ తరపున ఏఈఓలు టెక్నికల్ సపోర్టు ఇస్తూ రైతులకు కాటన్ సీడ్ సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని అన్నారు. కంపెనీ నాణ్య మైన సీడ్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, కాటన్ సీడ్ రైతులకు మే, జూన్ ప్రొడక్ష న్ ప్లాన్ డీటెయిల్స్ తెలపాలని, కంపెనీ వారు కాటన్ సీడ్ ప్రైజ్ పెరిగే విధంగా చూడా లని ఆదేశించారు. సమావేశంలో వ్యవసా య అధికారి గోవింద్‌నాయక్, వ్యవసాయ అధికా రులు, ఆర్గనైజర్లు, సీడ్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటికి మిషన్‌భగీరథ నీరు సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలి: జిల్లా కలెక్టర్



సీడ్ కంపెనీ ప్రతినిధులు, ఆర్గనైజర్లతో మాట్లాడుతున్న కలెక్టర్

**వనపర్తి ప్రతినిధి,ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** జిల్లాలో తాగునీటి సరఫరాలో ఎలాంటి ఆటంకం లేకుండా ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నీరు సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్ లాల్‌పవార్ తాగునీటి అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీలో మిషన్ భగీరథ పై త్రాగునీటి సరఫరా గురించి అధికారులతో చర్చించారు. ప్రస్తుత వేసవి ఉన్నందున ప్రతి ఇంటికి నల్ల నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతిరోజు నీటిశుద్ధి కేంద్రాల నుండి నీరు సరఫరా జరిగేలా మిషన్ భగీరథ ఇంజనీర్లు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇంకా జిల్లాలో ఏఏ గ్రామాలకు త్రాగునీరు వెళ్లడం లేదు పూర్తిగా తెలుసుకోవాలని అన్నారు. అనంతరం విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఆటంకం కలగకుండా విద్యుత్ సిబ్బంది ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రకృతి వైపరిత్యాలు జరిగినప్పుడు విద్యుత్ వైర్లు, స్థంభాలు కూలిపోకుండా భద్రత చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో అన్ని విద్యుత్ లైన్‌లు పర్యవేక్షణ చేయాలని అన్నారు.

## డిగ్రీ బ్యాక్ లాగ్ సబ్జెక్టు రాసుకునేందుకు చివరి అవకాశం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:**డిగ్రీ ఇయర్ వైస్ బ్యాక్ లాగ్ పరీక్షలకు సంబంధించి ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేసినట్లు నాగర్‌కర్నూల్ ఐడీ (ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్స్) ప్రిన్సిపాల్ కమర్ షాజహాన్ సుల్తానా తెలిపారు.


ప్రిన్సిపల్ కమర్ షాజహాన్ సుల్తానా

2010-2011 నుంచి 2015-16 మధ్య కాలంలో డిగ్రీ అడ్మిషన్ పొంది మిగిలిపోయిన సబ్జెక్టులకు చివరి అవకాశంగా రాయడానికి వీలు కల్పించడమైందని, ఫైన్ లేకుండా ఈ నెల 29వ తేదీ వరకు మరియు ఫైన్‌తో మే 5వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించి విద్యార్థులు పరీక్షలకు సిద్ధం కావాలని ప్రిన్సిపాల్ తెలిపారు. 2010-11 నుంచి 201-15 వరకు పరీఓ ఫీజుతో పాటు ప్రతి సబ్జెక్టుకు రూ.5వేలు చొప్పున పరీక్ష ఫీజు చెల్లించాలని, అదే విధంగా 2015-16 వారు పరీక్ష ఫీజుతో పాటు సబ్జెక్టుకు రూ.1000 చొప్పున పరీక్ష ఫీజు చెల్లించాలని తెలిపారు. ఇట్టి అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదే విధంగా రెగ్యులర్ సీబీఎస్ డిగ్రీ విద్యార్థులు 4, 6వ సెమిస్టర్ 2వ, 4వ, 6వ సెమిస్టర్ బ్యాక్ లాగ్ పరీక్ష ఫీజు తేదీ ఈ నెల 29వరకు చెల్లించి పరీక్షలకు సిద్ధం కావాలన్నారు.

## మే డే స్ఫూర్తితో ప్రైవేటీకరణపై పోరాడాలి...

**కల్వకుర్తి, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:**ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే వారోత్సవాలు ఘనంగా నిర్వహించాలని ఎల్ఐసీ-ఐసీఈయూ కల్వకుర్తి బ్రాంచ్ లక్ష్మణాచారి అన్నారు. బుధవారం కల్వకుర్తి పట్టణంలోని టీఎస్ యూటీఎఫ్ భవన్‌లో వివిధ ప్రజా సంఘాల బాధ్యుల సమావేశం సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు అధ్యక్షతన మే డే సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో లక్ష్మణాచారి మాట్లాడుతూ మే డే స్ఫూర్తితో కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మికులు, ఉద్యోగులు ఐక్యంగా పోరాడాలన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ప్రైవేటీకరణకు పెద్దపీట వేస్తూ బడా కార్పొరేట్ సంస్థలకు ప్రజల ఆస్తి దోచి పెడుతుందని, అందులో భాగమే ఎల్ఐసీ, రైల్వే రక్షణ లాంటి రంగాల్లో ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహిస్తుందన్నారు. మే డేను పట్టణంలో కార్మికులంతా పాల్గొని ఘనంగా నిర్వహించాలన్నారు. నాయకులు ఎపీ మల్లయ్య, పరుశరాములు, చిన్నయ్య, నెహ్రుప్రసాద్, బాల్‌రెడ్డి, ఆంజనేయులు, శ్రీనివాసులు, కృష్ణయ్య, అశోక్, జగన్, రేణయ్య తదితరులు ఉన్నారు.

## మహర్షి జయంతి వేడుకలకు రండి..

**కలెక్టర్‌ను ఆహ్వానించిన సగర సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణీల్‌చందర్**


కలెక్టర్‌ను సన్మానిస్తున్న ప్రణీల్‌చందర్, సగరసంఘం సభ్యులు

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** శ్రీ భగీరథ మహర్షి జయంతి ఉత్సవాలకు హాజరుకావాలని మహబూబ్‌నగర్ జిల్లా సగర సంఘం అధ్యక్షుడు, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణీల్‌చందర్ కలెక్టర్ రవినాయక్‌ను కోరారు. ఈమేరకు గురువారం వైశాఖ శుద్ధ సప్తమి సందర్భంగా అధికారికంగా నిర్వహించనున్న మహర్షి జయంతి వేడుకలకు హాజరుకావాలని కోరారు. బుధవారం మహబూబ్‌నగర్ నూతన కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వానించి సన్మానించారు. కార్యక్రమంలో సగర సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యం, కోశాధికారి నారాయణ, రాష్ట్ర యువజన సంఘం ఉపాధ్యక్షుడు పల్లె చందర్‌సగర, గాజులపేట, సర్పంచ్ చంద్రశేఖర్, సగర సంఘం సేవాసమితి ఉపాధ్యక్షుడు గడ్డమీద కృష్ణ, సంజీవ పాల్గొన్నారు.

## మహాసభకు తరలిన ముదిరాజులు..

**వెల్దండ, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:**కల్వకుర్తి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో ఏర్పాటు చేసిన ముదిరాజ్ మహాసభ బహిరంగ సభకు వెల్దండ మండల పరిధిలోని అన్ని గ్రామాల ముదిరాజ్ కులస్థులు అధ్యక్షుల సమక్షంలో తరలివెళ్లారు. మండల కేంద్రంలోని బుధవార్‌పేట ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి బాణసంచా పేల్చి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ వాహనాల్లో బహిరంగ సభకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బీసీడీ నుంచి బీసీఎలోకి రిజర్వేషన్ ప్రక్రియను మార్చాలని, ముదిరాజ్‌లకు ముదిరాజ్ బంధును ఏర్పాటు చేసి రూ.10లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మల్లేష్ ముదిరాజ్, నూకం వెంకటయ్య, క్యాసరపు వెంకటయ్య, భయ్య మల్లయ్య, లింగం ముదిరాజ్, శేఖర్, కృష్ణ, బొక్కల శ్రీను, వెంకటేష్, మల్లేష్, దేవేందర్, నర్సింహ్మా, ఎర్ర శ్రీను, రమేష్, ప్రహ్లాద్, బాలకృష్ణతో పాటు గణేష్ తదితరులు ఉన్నారు.


ఫోటోరైటప్ : 09 : మహాసభకు తరలి వెళ్తున్న ముదిరాజ్‌లు

## తడసిపోయిన ధాన్యాన్ని పరిశీలించిన బీఆర్ఎస్ నాయకులు

**దేవరకద్ర, ఎప్రిల్ 26 ప్రభాతవార్త:** దేవరకద్ర మార్కెట్‌యార్డులో మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని బుధవారం యంపీపీ కెంగూరి రమాశ్రీకాంత్‌యాదవ్ అధ్వర్యంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు పరిశీలించారు. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆదేశానుసారం వారు మార్కెట్‌యార్డుకు వచ్చి ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతులు ఎట్టి పరిస్థితుల్లో అధైర్యపడరాదని వారు రైతులకు భరోస ఇచ్చారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అలాగే పంటనష్టం వివరాలను అడిగి తెలుసుకొన్నారు. మార్కెట్‌యార్డులో తడసిన ధాన్యాన్ని కొనడంతో పాటు వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకొంటామన్నారు. సమస్యను ఎమ్మెల్యే ఆలతో పాటు ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్ళి నష్టపరిహారం అందేలా చూస్తామన్నారు. యుద్ధప్రాతిపదిక మీద నష్టపోయిన ధాన్యం పంటల వివరాలు సేకరించాలని ఎమ్మెల్యే ఆల అధికార యంత్రంగాన్ని ఆదేశించారన్నారు. ఈ కార్యక్రమంలో యంపీపీ కెంగూరి రమాశ్రీకాంత్‌యాదవ్, మార్కెట్ చైర్మెన్ విజయ వెంకటేశ్, బీఆర్ఎస్ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు కెంగూరి శ్రీకాంత్‌యాదవ్, నాయకులు కొండ శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


తడిచిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## ఈ నెల 30న బ్రహ్మంగారి ఆరాధన...

**వెల్దండ, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:**వెల్దండ మండల కేంద్రంలోని బ్రహ్మగిరి దేవాలయంలో ఈ నెల 30వ తేదీన ఆదివారం ప్రపంచానికి కాలజ్ఞానం అందించిన శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షులు అన్నదానం కృష్ణయ్యచారి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరాధాన ఉత్సవాల్లో భాగంగా గ్రామంలో స్వామి వారి ఊరేగింపు, ఆలయంలో హోమం, ప్రవచనాలు నిర్వహిస్తున్నట్లు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆరాధన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వేణుగోపాలాచారి, పాండురంగాచారి, రామాచారి, వెల్దండ రామకృష్ణచారి, జంగయ్యచారి, శ్రీనివాసాచారి, చెన్నయ్యచారి, శ్రీశైలంచారి, రమేష్‌చారి, శివచారితో పాటు తదితరులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అన్నదానం కృష్ణయ్యచారి

## కౌకుంట్లలో గ్రామదేవతల ప్రథమ వార్షిక మహోత్సవాలు ప్రారంభం..

**దేవరకద్ర, ఎప్రిల్ 26 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండల కేంద్రంలో బుధవారం బోడ్రాయి, పెద్దమ్మ, కోటమైసమ్మ, కట్రెమ్మ గ్రామ దేవతల ప్రథమ వార్షిక మహోత్సవాలను ప్రారంభయయ్యాయి. భక్తి టీవి కోటీదీపోత్సవ ప్రధాన అర్చకుడు రేవల్లిరాజుశర్మ అధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ నెల 28 వరకు ఈ మహోత్సవాలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా ఉత్సవాల మొదటిరోజు ఉదయం 8లకు మహాగణపతిపూజ కార్యక్రమంతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. అలాగే పుణ్యహావచనం, అఖండదీపారాధన, పంచగవ్యప్రాశన, రుత్విక్‌వరణం, రక్షబంధనం, కంకణధారణ, దేవతా ఆరాధన, ప్రధాన కలశస్థాపనం, మండప ఆరాధన, విశేషమైన అభిషేకాలు, మహాస్నపనం కార్యక్రమాలను నిర్వహించారు.

అలాగే అగ్ని ప్రతిష్టాపన, విశేషయజ్ఞాలు, ప్రధాన దేవతల హోమాలు, మూల మంత్ర హోమాలు, ప్రాణ, తత్వ, కళన్యా సహామాలు, అష్టబలి, మహాబలి, మహాపూర్ణాహుతి, విశేష అలంకరణ, అవబృతస్నానం, వేద ఆశిర్వచనములు తదితర పూజలను కూడ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ స్వప్నకిషన్‌రావుతో పాటు గ్రామస్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.


కౌకుంట్లలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

**నేడు బైండ్ల సోదరుల ప్రత్యేక కార్యక్రమం..** కౌకుంట్ల మండల కేంద్రంలో గ్రామ దేవతల ప్రథమ వార్షిక మహోత్సవాలలో భాగంగా గురువారం బైండ్ల సోదరుల ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.


పూర్ణాహుతి నిర్వహిస్తున్న పురోహితులు

## రైతు చెంతకే వరి కొనుగోలు కేంద్రాలు:ఎంపిపి

**కోయిల్‌కొండ, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :** రైతు చెంతకే వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని ఎంపిపి శశికళ భీంరెడ్డి, మండల సింగిల్‌విండో ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డిలు తెలిపారు. బుధవారం మండలంలోని గార్లపాడు, మల్కాపూర్, వీరంపల్లి, కోయిల్‌కొండ, అంకిళ్ల, సంగనోనిపల్లి, ఎల్లారెడ్డిపల్లి, వింజమూర్, చందాపూర్ గ్రామాలలో వరి కొనుగోలు కేంద్రాలను ఎంపిపి శశికళ భీంరెడ్డి, సింగిల్‌విండో ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డిలు ప్రారంభించారు. వరి కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా నారాయణపేట నియోజకవర్గ టిఆర్ఎస్ పార్టీ సమన్వయకర్త ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి సోదరుడు ఎస్.రవిందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హజరై మాట్లాడారు. యాసంగిలో పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా కొనుగోలు చేయాలని ఆయన సూచించారు. పిఎసిఎస్, ఐకెపి ద్వారా వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గతంలో వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన ప్రభుత్వాలు ఎక్కడ లేవన్నారు. రైతు పండించిన చివరి గింజదాకా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బి.కృష్ణ, జిల్లా రైతు సమన్వయ కమిటి సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, మండల రైతు సమన్వయకర్త మల్లయ్య యాదవ్, గార్లపాడు సర్పంచ్ ఆంజనేయులు, ఎంపిటిసి విజయలక్ష్మి సత్యరెడ్డి, వీరంపల్లి సర్పంచ్ ఆంజనేయులు, సంగనోనిపల్లి సర్పంచ్ అనిత భీమ్‌రెడ్డి, అంకిళ్ల సర్పంచ్ రజిత రవిందర్‌రెడ్డి, ఎంపిడిఓ జయరాం, మండల వ్యవసాయ శాఖ అధికారి రాంపాల్, ఐకెపి ఎపిఎం విజయకుమారి, ఐకెపి సిసిలు మల్లేష్, కేశవులు, విఓఎ వీరంపల్లి నరసింహారెడ్డి పాల్గొన్నారు.


వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

## నిరవధిక సమ్మెకు సంఘీభావం తెలిపిన బిజెపి నాయకులు

**సమ్మెలో పాల్గొన్న బిజెపి జిల్లా అధ్యక్షుడు రామచంద్రరెడ్డి**


విఓఎల సమ్మెకు మద్దతు తెలిపి మాట్లాడుతున్న బిజెపి జిల్లా అధ్యక్షుడు రామచంద్రరెడ్డి

**గద్వాల ప్రతినిధి, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :** ఐకెపి విఓఎలు బుధవారం నిర్వహించిన సమ్మెకు బిజెపి జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత రోడ్లమీదికి ఏ ఒక్క కాంట్రాక్టర్ ఉద్యోగి రోడ్ల మీదకు వచ్చేది ఉండదని పర్మినెంట్ చేస్తా అని ప్రగల్భాలు పలికిన కెసిఆర్ తెలంగాణ వచ్చిన తర్వాత ప్రతి ఒక్కరు రోడ్ల మీదకు వచ్చే పరిస్థితి ఏర్పడిందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం విఓఎల శ్రమను దోచుకుంటుందని అన్నారు. మొన్నటికి మొన్న మున్సిపల్ ఉద్యోగులు, జూనియర్ కళాశాలలో కాంట్రాక్టు లెక్చరర్లు గాని, పర్మినెంట్ చేస్తానని రెండు పర్యాయాలు గద్దెనెక్కి తెలంగాణ రాకముందు 65 వేల కోట్లు ఉన్న అప్పును 5 లక్షల 35 వేల కోట్లు చేసి ఏం అభివృద్ధి చేశారని జిల్లా అధ్యక్షులు ప్రశ్నించారు. అదేవిధంగా ఎప్పుడు ఎన్నికలు జరిగినా తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీని బొంద పెడతామని అన్నారు. 2023లో ఎన్నికలలో గెలిచి ప్రతి ఒక్కరిని పర్మినెంట్ చేసే బాధ్యత భారతీయ జనతా పార్టీదే అని అన్నారు. రాష్ట్రంలో కెసిఆర్, ఇక్కడ ఎమ్మెల్యే గద్వాల ప్రజలను మోసం చేస్తున్నాడన్నారు. బిజెపి పార్టీ అధికారంలోకి రాగానే తెలంగాణలో ఉన్న 80 వేల మందిని పర్మినెంట్ చేస్తామని సమాన పనికి సమాన వేతనమని, యూనిఫామ్, ఇన్సూరెన్స్ కల్పిస్తామని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గడ్డం కృష్ణారెడ్డి, రాష్ట్ర ఓబిసి మోర్చా అధికార ప్రతినిధి నాగేందర్ యాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు మాలశ్రీను, బిజెపి సీనియర్ నాయకులు భాస్కర్ యాదవ్, పులిపాటి వెంకటేష్, అల్వాల రాజశేఖర్, శ్రీనివాస్‌గౌడ్, గీతారెడ్డి, గోపాల్, మోహన్, రాంప్రసాద్ ఉన్నారు.

## మల్టీ పర్పస్ విధానం రద్దు చేయాలని పెండింగ్ జీతాలు ఇవ్వాలని సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా

**మూసపేట, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :** మూసాపేట ఎంపిడిఓ కార్యాలయం ముందు బుధవారం తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికుల మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని, జీతాలు 26 వేలకు పెంచాలని, పెండింగ్ జీతాలు తక్షణమే చెల్లించాలని, పని ఒత్తి తగ్గించాలని, గ్రామాల్లో రాజకీయ వేధింపులు అరికట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపిడిఓ స్వరూప, ఎంపిఓ సరోజలకు వినతి పత్ర సమర్పించారు. వారు మాట్లాడుతూ మీ హక్కుల కోసం మీరు పోరాడండి సమయానుకూలంగా పనులు చేయండని, ఇన్సూరెన్స్, గుర్తింపు కార్డులు చేస్తామని, తపాలా భీమా 10లక్షలు ఇస్తామని ప్రభుత్వ పరంగా రావాల్సిన అన్నింటిని అమలు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బాలనరసింహులు, శ్రీనివాస్, మధు, హనుమంతు, సర్దార్, ఖాదర్, లావణ్య, నాగమ్మ, నరెందర్, బాలమ్మ, వెంకటయ్య, ఆంజనేయులు, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

## జలాల్పూర్ చెక్‌పోస్టును పరిశీలించిన సిఐ రవిబాబు

**అధికారులందరు అప్రమత్తంగా ఉండండి**

**నారాయణపేట ప్రతినిధి, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :** కర్ణాటక రాష్ట్రంలోని సాధారణ అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న సందర్భంగా బుధవారం ఉదయం నారాయణపేట సిఐ రవిబాబు, ఎస్సై సురేష్‌లు కర్ణాటక రాష్ట్రం, నారాయణపేట జిల్లా సరిహద్దు సైదాపూర్ పోలీసులు ఏర్పాటు చేసిన జలాల్పూర్ చెక్‌పోస్టును పరిశీలించారు. అనంతరం సిఐ రవిబాబు మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రంలో సాధారణ అసెంబ్లీ ఎన్నికల సందర్బగా సరిహద్దు పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుకు నారాయణపేట పోలీసులు అన్ని విధాలా పూర్తి సహకారం అందిస్తామని ఎన్నికలు అయిపోయేంత వరకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రెండు, మూడు రోజుల్లో నారాయణపేట పరిధిలో చెక్‌పోస్టు ఏర్పాటు చేయడం జరుగుతుందని కర్ణాటక రాష్ట్రం నారాయణపేట జిల్లాకు అక్రమంగా డబ్బు, మద్యం, చీరలు, ఇతర వ్యాపార వ్యవహారాలపై పూర్తి నిఘా ఏర్పాటు చేసి పకడ్బందీగా వాహనాలను తనిఖీ నిర్వహించడం చేస్తామని సైదాపూర్ పోలీసులకు సిఐ తెలిపరు. అదేవిధంగా చెక్‌పోస్టు దగ్గర పనిచేసే ప్రతి పోలీస్, రెవెన్యూ ఆఫీసర్లు ఖచ్చితంగా క్షుణ్ణంగా పరిశీలించి తనిఖీచేసి వాహనాలను వదలాలని వారు తెలిపారు.


చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న సిఐ

## రోడ్లు ఊడ్చి వినూత్న నిరసన..



**మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** ఐకేపీ వీవోఏ లు బుధవారం రోడ్లు ఊడ్చి వినూత్నరీతిలో నిరసన తెలిపారు. జడ్చర్లలోని సిగ్నల్‌గడ్డ వద్ద బీఆర్‌అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఐకేపీ వీవో ఏల సమ్మె పదో రోజుకు చేరుకున్నది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య మాట్లాడుతూ ప్రభుత్వం చర్చలకు పిలిచి సానుకూలంగా డిమాండ్లు నెరవేర్చాలని లేనిపక్షం లో ఆందోళన ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఐకేపీ వీవోఏలంకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సాధారణ భీమా రూ.10లక్షలు సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో బేగం సరిత, రమేశ్, సరస్వతి, కల్పన, అలివేల, మహేశ్వరి, జంగమ్మ, స్వరూప, రాణి, బాలమణి, భాగ్యలక్ష్మి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌ఓసీ చెక్కు అందజేత...

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:**బిజినపల్లి మండల కేంద్రానికి చెందిన బాలరాజు గత కొన్ని రోజులుగా వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. బాలరాజు కుటుంబ ఆర్థిక ఇబ్బందుల వల్ల మెరుగైన వైద్య చికిత్స చేయించుకోలేక ఇబ్బందులు పడుతుండటంతో స్థానికులు ఎమ్మెలే మర్రి జనార్ధన్‌రెడ్డి దృష్టికి విషయాన్ని తీసుకొచ్చారు. స్పందించిన ఆయన మెరుగైన వైద్య సేవల నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి రూ.1లక్ష ఎల్‌ఓసీ చెక్కును ఎమ్మెల్యేమర్రిజనార్ధన్‌రెడ్డి బుధవారం అందించారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు ఉన్నారు.


రూ.లక్ష ఎల్‌ఓసీ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి

## పంటనష్టం పోయిన రైతులకు నష్టపరిహారం అందజేయాలి

**సామాజికవేత్త కావలి పవన్‌కుమార్‌యాదవ్ డిమాండ్**

**దేవరకద్ర, ఎప్రిల్ 26 ప్రభాతవార్త:** కురిసిన వర్షాలకు వరిపంటను నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందజేయాలని ప్రముఖ సామాజికవేత్త కౌకుంట్ల కావలి పవన్‌కుమార్‌యాదవ్ డిమాండ్ చేశారు. కురిసిన అకాల వర్షానికి రైతులు చాలా నష్టపోయాయన్నారు. చేతికి వచ్చిన వరిపంట చేతికి అందకుండ పోయిందని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. కావున ప్రభుత్వం వెంటనే ఈ విషయంలో స్పందించి పంటనష్టపోయిన రైతాంగాన్ని గుర్తించి నష్టపరిహారాన్ని అందజేసి ఆదుకోవాలని ఆయన కోరారు.

## నార్లోనికుంటలో కంటివెలుగు ప్రారంభం

**దేవరకద్ర, ఎప్రిల్ 26 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం నార్లోనికుంటలో బుధవారం కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యంపీపీ కెంగూరి రమాశ్రీకాంత్‌యాదవ్, బీఆర్ఎస్ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు కెంగూరి శ్రీకాంత్‌యాదవ్, సర్పంచ్ రామాంజనేయులు, ఉపసర్పంచ్ నాగేశ్, మాజీసర్పంచ్ రాఘవులు, కార్యదర్శి రాఘవేందర్, సాయిలు, వివేక్‌గౌడ్, సత్యం, అబ్దులు, బాలయ్య, మొగులయ్య, హన్మంతు, తిరుమలయ్య, వీఆర్ఎ వెంకటేశ్, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ, వైద్యసిబ్బంది, గ్రామస్థులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## రికార్డులను పరిశీలించిన జిల్లా వైద్యారోగ్యశాఖ

**అధికారి డా.రామ్‌మనోహర్‌రావు**



**ఉట్కూర్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా.రామ్‌మనోహర్‌రావు బుధవారం రికార్డులను తనిఖీ చేశారు. అదేవిదంగా న్యూట్రికిట్స్‌కు సంబంధించిన గదిని ఏ విధంగా తయారు చేశారని పరిశీలించారు. ఐఎల్ఆర్, డీ ఫ్రీజర్‌ల పనితీరును కూడా సమీక్షించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాల సంఖ్య పెంచాలని దానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని ఒక కన్వర్జేన్స్ సమన్వయ కమిటి సమావేశాన్ని నిర్వహించి కాన్పుల సంఖ్య పెరిగేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. డా. హబీబ్, ఆరోగ్య విస్తరణ అధికారి విజయ కుమార్, ఎన్సీడీ స్టాఫ్‌నర్సు రాజశ్రీ, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

## డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం..

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** పదో తరగతి పూర్తి చేసిన బాల సదనం, మహిళా విద్యా సంస్థల్లో (కేజీబీవీ), అనాథ, నిరాశ్రయులైన బాలికలు, అక్రమ రవాణాకు గురైన బాలికలు 2023-24 విద్యా సంవత్సరానికి హైదరాబాద్‌లో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా టెక్నికల్ శిక్షణ సంస్థల్లో పాలిటెక్నిక్ (3) సంవత్సరాల కోరుల్సకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి జరీనా బేగం ప్రకటనలో తెలిపారు.

## అర్హులైన దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలి

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల సహకార సంస్థ ఆధ్వర్యంలో 2022-23ఆర్థిక సంవత్సరానికిగానూ మహబూబ్‌నగర్ జిల్లాలో అర్హులైన దివ్యాంగులు ఉచితంగా అందజేసే సహాయ ఉపకరణాల దరఖాస్తుల గడవు ను మే5వరకు పొడిగించినట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి జరీనాబేగం బుధవారం ప్రకటనలో తెలిపారు. రెట్రో ఫిట్టెడ్ మోటర్ వెహికిల్(12), బ్యాటరీ వీల్ చైర్స్(9), ల్యాప్‌ట్యాప్‌లు(6), డైసీ ప్లేయర్(1), 4జి స్మార్ట్ ఫోన్లు(15), సాధారణ వీల్ చైర్లు (3), మూడు చక్రాల సైకిళ్లు (22), చంక కర్రలు (42), వినికిడి యంత్రాలు (15), అందులచేతి కర్రలు(17), అంధుల స్మార్ట్ కేన్ డివైసెస్(4), టీఎల్ఎంకిట్స్ (9)ను జిల్లాలోని అర్హులైన దివ్యాంగులకు అందజేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

## సీసీ డ్రైన్ల పరిశీలన..



**మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీల్లో సీసీ డ్రైన్లను మున్సిపల్ చైర్‌పర్సన్ దోరెపల్లి లక్ష్మి పరిశీలించారు. ఈ మేరకు బుధవారం 26వ వార్డులో సీసీ రోడ్లు , డ్రైనేజీలను ఆమె పరిశీలించారు. కాలనీలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. డ్రైనేజీల్లో ఎప్పటికప్పుడు చెత్త తొలగించాలని, చెత్తాచెదారం పేరుకుపోకుండా చూడాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. ఆమె వెంట కౌనల్సిలర్ ఆలూరి శశికిరణ్, బీఆర్ఎస్ నాయకుడు దోరెపల్లి రవీందర్ ఉన్నారు.

## నేడు జెడ్పీలో అధికారికంగా మహర్షి జయంతి వేడుకలు:కలెక్టర్

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం శ్రీ భగీరథ మహర్షి జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జి రవినాయక్ ప్రకటనలో తెలిపారు. ఈమేరకు జెడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 10.30గంటలకు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉత్సవాలకు ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, పార్లమెంట్ సభ్యులు, శాసన సభ్యులు హాజరుకానున్నట్లు తెలిపారు. కావునా ప్రజాప్రతినిధులు, సగర సంఘం నాయకులు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు.

# 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలి

▸▸ మున్సిపల్ వైస్ ఛైర్మన్ వాకిటి శ్రీధర్ ▸▸ 30వ వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించిన మున్సిపల్ వైస్ ఛైర్మన్

**వనపర్తి టౌన్,ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి కేసీఆర్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన గొప్ప పథకంలో కంటివెలుగు ఒకటని మున్సిపల్ వైస్ ఛైర్మెన్ పేర్కొన్నారు. వనపర్తి మున్సిపల్ పరిధిలో స్థానిక 30వ వార్డు జంగిడిపురం కాలనీలో గల బ్లాజమ్స్ స్కూల్‌లో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆరోగ్య సిబ్బందితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు పథకాన్ని 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని ఆయన సూచించారు. అవసరమైన వారికి ఉచితంగా అద్దాలు పంపిణీ చేయడమే కాకుండా ఆపరేషన్ అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటి వరకు వనపర్తి పట్టణంలో 30 కేంద్రాలలో కంటి వెలుగు కార్యక్రమం పూర్తి


కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ వైస్ ఛైర్మన్ వాకిటి శ్రీధర్

అయిందని ఇందులో 37,272 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 3649 మందికి రీడింగ్ గ్లాసులు పంపిణీ చేయడం జరిగిందని, మరొక 4699 మందికి ప్రిస్క్రిప్షన్ అద్దాలను రిఫెర్ చేసినట్లు త్వరలో వాటిని కూడా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. 799 మందికి సర్జరీల కోసం ప్రెఫర్ చేసినట్లు వారు తెలిపారు. ప్రజల్లో కంటి వెలుగు కార్యక్రమానికి అనూహ్య స్పందన వస్తుందని తెలిపారు. ఇంత గొప్ప కార్యక్రమాన్ని తీసుకువచ్చిన రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, సీఎం కేసీఆర్ కు వనపర్తి పట్టణ ప్రజల తరుపున ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, కంటి వైద్యులు హర్షిత, ఎండి ఖాదర్, రాము, నిర్మల,రాజలక్ష్మీ, కాలనీవాసులు రఘునాథ్‌రెడ్డి, కురుమన్న,మద్దిలేటి, పాపిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన మార్కెట్ కమిటీ ఛైర్మన్, మున్సిపల్ వైస్ ఛైర్మన్


తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మార్కెట్ కమిటీ ఛైర్మన్ రమేష్‌గౌడ్

**వనపర్తి టౌన్,ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి వనపర్తి మార్కెట్ యార్డులో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం తడిసిన విషయం తెలుసుకున్న మార్కెట్ కమిటీ ఛైర్మెన్ పలుస రమేష్‌గౌడ్, మున్సిపల్ వైస్ ఛైర్మెన్ వాకిటి శ్రీధర్ తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగావారు మాట్లాడుతూమార్కెట్ యార్డులో తడిసిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా మార్కెట్ కమిటీ ఆదుకుంటుదని,ఈ విషయాన్ని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, రైతులకు నష్టం కాకుండా అన్ని చర్యలు తీసుకోవలసిందిగా జిల్లా అదనపు కలెక్టర్‌కు, మార్కెట్ ఛైర్మెన్‌కు మంత్రి ఆదేశాలు జారీ చేశారని తెలిపారు.వారి వెంటమార్కెట్ కమిటీ డైరెక్టర్ డా.లతీఫ్. బండారు నంద, మార్కెట్ డీఎం సింగ్, సెక్రటరీ లక్ష్మయ్య గౌడ్, రైతులు ఉన్నారు.

## 13వ వార్డు కౌన్సిలర్‌కు ఘన సన్మానం


కౌన్సిలర్ పుట్టపాకల మహేష్‌ను సన్మానిస్తున్న వార్డు ప్రజలు

**వనపర్తి టౌన్,ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** రాంనగర్ కాలనీ 13వ వార్డులో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సహకారంతో కాలనీలో ఎన్నో ఏళ్ల కళ ప్రధాన సీసీ రహదారి నూతనంగా నిర్మించినందుకు కాలనీవాసులు కౌన్సిలర్ పుట్టపాకల మహేష్ ను శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. గత పాలకుల నిర్లక్ష్యంతో రోడ్ల నిర్మాణానికి నోచుకోని వార్డును ఎప్పటికప్పుడు వార్డు కౌన్సిలర్ పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే స్పందించి పరిష్కరించే దిశగా డ్రైనేజీ నిర్మాణాలు, వీధి లైట్లు, మంచి నీటి సరఫర తదితర సమస్యలను పరిష్కరిస్తున్నందుకు కౌన్సిలర్ ను సన్మానించినట్లు కాలనీవాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గట్టు రాంనారాయణ,రాణిమ్మ, బుర్ర శాంతన్న గౌడ్, యశోదమ్మ,శశి, శేఖర్,రాజేష్ బాబు,శ్రీనివాసులు,సుబ్బయ్య, వెంకట్ రాములు, సురేష్, మహేష్, నవీన్, నిర్మల, కాలనీవాసులు పాల్గొన్నారు.

## టీ-సేవ్ నిరుద్యోగ దీక్ష


టీ-సేవ్ నిరుద్యోగ దీక్షకు బయలుదేరిన వైఎస్ఆర్‌టీపీ నాయకులు

**వనపర్తి టౌన్,ఏప్రిల్26 ప్రభాతవార్త:** ప్రశ్నించే గొంతుకను అణిచివేసేందుకు కేసులు పెట్టి కుట్ర పూరిత చర్యలకు పాలుపడుతున్న ప్రభుత్వానికి ప్రజలు రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెప్తారని, వైఎస్ఆర్ టీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ మెంబర్ వనపర్తి నియోజకవర్గ ఇంచార్జ్ బుజల వెంకటేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు ఇందిరా పార్క్ దగ్గర షర్మిలమ్మ చేపట్టనున్న టీ-సేవ్ నిరుద్యోగ దీక్షకు నియోజకవర్గం నుంచి బుధవారం ఆయన మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులతో మహిళలపై జులుం చేసి అక్రమ కేసులు పెట్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు. వెంటనే టీఎస్ పీఎస్సీ ఉద్యోగాలు భర్తీ చేయాలని అన్నారు. లేకుంటే వైఎస్ఆర్‌టీపీ పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.కార్యక్రమంలో కె.వెంకటేశ్వర్లు, మహేష్, బొడ్డుపల్లి సతీష్ కుమార్,మహ్మద్ అన్వర్,పరమేష్, కాంతయ్య,సందీప్,రాజశేఖర్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## పగిలిన మ్యాన్ హోల్.. పట్టించుకోని అధికారులు

**వీపనగండ్ల,ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలోని 6వ వార్డులో మ్యాన్‌హోల్ పగిలి నెల రోజులు కావస్తున్న అధికారులు నిమ్మకు నీరుఎత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికి పగిలిపోయిన మ్యాన్ హోల్ గురించి వార్త దినపత్రికలో ప్రచురించడం జరిగింది. ఈ రోడ్డే మీద వెళ్లే వాహనదారులకు ప్రజలకు ప్రాణహాని ఉన్న కూడా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రజల ప్రాణాలు అంటే అధికారులకు లెక్క లేకుండా పోయిందని, 6వ వార్డు ప్రజలు, వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి మ్యాన్‌హోల్ కప్పులను త్వరగా అమర్చాలని ప్రజలు కోరుతున్నారు.


6వ వార్డులో పగిలిన మ్యాన్‌హోల్

## బీచుపల్లిలో సీతారాముల కల్యాణం

**ఇటిక్యాల,ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** మండల పరిధిలోని బీచుపల్లి పుణ్య క్షేత్రంలోని కోదండ రామాలయంలో బుధవారం స్వామివారి పునర్వసు జన్మనక్షత్రాన్ని పురస్కరించుకుని సీతారాముల కళ్యాణం ఘనంగా నిర్వ హించారు. స్వామి వారి కళ్యాణోత్సవాన్ని అర్చకులు భువనచంద్ర, దత్తు స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి కళ్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు ఆలయకమిటి ఆధ్వర్యంలో ఉచిత అన్న దాన కార్యక్రమం చేపట్టినట్లుఆలయ మేనేజర్ సురేంద్రరాజు తెలిపారు.



## ఎర్రవల్లి చౌరస్తాలో చలివేంద్రం ఏర్పాటు

**ఇటిక్యాల,ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తాలో బుధవారం గ్రామ సర్పంచ్ రవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని 10వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ అనిల్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమాండెంట్ అనిల్ కుమార్ మాట్లాడుతూ ఎండలు విపరీతంగా ఉంటున్న సందర్భంగా వేసవి కాలం లో జాతీయ రహదారిపై మండల ప్రజలు, ఇతర గ్రామాల నుండి వచ్చి పలు ప్రాంతాలకు పనుల నిమిత్తం వెళ్తుంటారని ప్రయాణీకుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని చౌరస్తాలో చలి వేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని సర్పంచ్ రవిని అభినం దించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రవి, ఉపసర్పంచ్ పద్మ వెంక టన్న, వల్లూరు సర్పంచ్ ఏసన్న,వీరాపురం సర్పంచ్ రాముడు,స్థానికనాయకులు అంజి, దాసన్న ,వెంకటేష్, రవినాగేషులు, మద్దిలేటి,శేఖర్,సంపత్, శ్రీను పాల్గొన్నారు.



## అకాల వర్షానికి తడిసిన ధాన్యం


తడిసిన ధాన్యాన్ని బయటకు తీస్తున్న రైతులు

**వీపనగండ్ల,ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో మంగళవారం కురిసిన భారీ వర్షానికి రైతుల వరి ధాన్యం నీళ్లలో తడిసిపోయింది. మామిడి తోటల్లో మామిడి కాయలు రాలిపోయి మామిడి రైతులకు భారీ నష్టం వాటిల్లింది. మామిడి తోటలను లీజుకు తీసుకున్న రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేశారు.

## బీభత్సం సృష్టించిన అకాల వర్షాలు

◆చేతికొచ్చిన పంట వర్షార్పణం ◆పిడుగు పాటుతో రెండు ఆవులు, గేదె మృతి


పిడుగు పడడంతో మృతి చెందిన ఆవులు

**ధరూర్,ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** మండల పరిధిలో బుధవారం తెల్లవారు జామున అకాల వర్షాలు సృష్టించాయి. అకాల వర్షాలతో రైతులకు తీవ్ర నష్టాల పాలయ్యారు. చేతికి వచ్చిన పంట వర్షార్పణం కావడంతో కన్నీటి పర్యంతమవుతున్నారు. రైతులు చేతికి వచ్చిన వరిపంట ఈదురు గాలులతో వర్షం పడడంతో పంట పొలంలో ఉన్న వరి చేనులో గింజలన్ని నేలపాలయ్యాయి. నీలహళ్లి గ్రామంలో పిడుగుపడి రెండు ఆవులు చనిపోయాయి. రైతు తుర్క నర్సింహులు, రెండు ఆవులు ఖరీదు 50 వేల రూపాయలు పెట్టి కొన్నాడు. బుధవారం రాత్రి సమయంలో 2.20 భారీ పిడుగు పడి రెండు ఆవులు మరణించాయి. రైతుకు కన్నీటి రోదన మిగిలాయి. రైతుకు భరోసా ఇవ్వాలని గ్రామ ప్రజలు కోరారు. అలాగే మాట్లవీడు గ్రామంలో ఉరుములు, మెరుపుల దాడికి కుమ్మరి వీరేష్‌కు చెందిన గేదె మృత్యువాత పడింది.దాదాపు 95 వేల రూపాయలు విలువ చేసే గేదె మృతి చెందడంతో రైతు కన్నీరు మున్నీరయ్యాడు. ప్రజా ప్రతినిధులు ప్రభుత్వం సహాయం చేయాలని కోరారు.

## సవారమ్మ అవ్వ జాతర ఉత్సవాల్లో పాల్గొన్న నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా ఛైర్మన్


సవారమ్మ అవ్వ జాతర ఉత్సవాల్లో పాల్గొన్న రంజిత్‌కుమార్

**ధరూర్,ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** మండలంలోని ర్యాలంపాడు గ్రామంలోని శ్రీశ్రీశ్రీ సవారమ్మ అవ్వ దేవర జాతర ఉత్సవాల్లో నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా ఛైర్మన్ గొంగళ్ల రంజిత్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా గొంగళ్ల రంజిత్‌కుమార్ సవారమ్మ, కర్రెమ్మ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదనంతరం నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకుడు బోయకృష్ణ గృహంలో ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు.కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు, జిల్లా నాయకులు రంగస్వామి, పరశురాముడు, జమ్మన్న, ధరూర్ మండల అధ్యక్షుడు నెట్టెంపాడు గోవింద్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ శాంతన్న,నాయకులు కర్ణ,దానియేలు,మల్దకల్ మండల అధ్యక్షుడు విష్ణు, ఉపాధ్యక్షుడు ప్రేమ్‌రాజ్, నాయకులు గోపాల్,చిన్నరాముడు, గట్టు మండల అధ్యక్షుడు బలరాం,నాయకులు ఆలూరు వెంకట్రాములు పాల్గొన్నారు.

## తల్లిదండ్రులు పిల్లలపట్ల అప్రమత్తంగా ఉండాలి

◆ ఎస్సై శివనాగేశ్వర్ నాయుడు

**అమరచింత,ఏప్రిల్ 26ప్రభాతవార్త:** వేసవికాలంలో పాఠశాలలకు, కళాశాలలకు సెలవులు ఉండడం వల్ల పిల్లలను ఈత కొసం చెరువులు, జలశయాలు, బావుల దగ్గరకు పంపకుండా తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై శివనాగేశ్వర్ నాయుడు అన్నారు. బుధవారం అమరచింత మండల తహసిల్దార్ కార్యాలయం ఆవరణలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని, యువకులు అతివేగంగా నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకోని డ్రైవింగ్ చేస్తూ సెల్ ఫోన్ మాట్లాడడం వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉందని, రోడ్డుపై ట్రాఫిక్ రూల్స్ పాటించడం ప్రతి ఒక్కరు ఆచరించాలని, ఆయన వాహనదారులను కోరారు.మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తూ కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని ఆయన వాహనదారులను హెచ్చరించారు. ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులు ఎక్కించుకోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని అలాంటి ఆటోలో ప్రయాణికులు ఎక్కరాదని, వాటి వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన సూచించారు.


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై శివనాగేశ్వర్ నాయుడు

# భగీరథ జయంతిని విజయవంతం చేయండి

● జిల్లా అధ్యక్షుడు మోడల తిరుతపయ్య సాగర్

**వనపర్తి టౌన్,ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** భగీరథ జయంతిని విజయవంతం చేయాలని జిల్లా సగర సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతయ్య సాగర్ పిలుపునిచ్చారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని పట్టణ సగర సంఘం భవనం నుండి గురువారం ఉదయం 8గంటలకు బైక్ ర్యాలీ ప్రారంభమవుతుందని, కనుక అన్నీ మండలాల, గ్రామాల, పట్టణం జిల్లా కేంద్రం నుండి సగర బంధువులు అందరు హాజరుకావాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. భగీరథ జయంతి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తదితర ప్రముఖులు హాజరై భగీరథ చౌరస్తా లో భగీరథ మహాఋషి కి పూల మాలలు సమర్పిస్తారని, అనంతరం మర్రికుంట భగీరథ మహర్షి కి పూల మాల వేసి అక్కడినుండి జిల్లా సగర కళ్యాణమండపం వద్ద మీటింగ్ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి సగరులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర సగర ఉపాధ్యక్షుడు చిలుక సత్యం సాగర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చీర్ల విష్ణు సాగర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సత్యనారాయణ సాగర్, రాష్ట్ర యూత్ ఉపాధ్యక్షుడు గుండి వినోద్ సాగర్, సగర ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు సాగర్, జిల్లా ఉపాధ్యక్షుడు స్వామి సాగర్, పట్టణ అధ్యక్షుడు మురళీ సాగర్, పెబ్బేటి శ్రీనివాసులు, చీర్ల జనార్దన్, పట్టణయువజన అధ్యక్షుడుమహేష్ సాగర్,నాసనల్లి రాజు సాగర్ తదితరులు ఉన్నారు.


సగర సమావేశంలో మాట్లాడుతున్న మోడల తిరుపతయ్య సాగర్

# మైనింగ్ తవ్వకాలను వెంటనే నిలిపివేయాలి

**కోయిల్‌కొండ,ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** మండలంలోని రాజునాయక్ గ్రామ పంచాయతీలో గ్రామ పంచాయతీకి సంబధించిన ఎలాంటి అనుమతులు లేకుండా మైనింగ్ తవ్వకాలను చేపడుతున్నారని దీనిని వెంటనే నిలిపివేయాలని గ్రామ పంచాయతీ గిరిజన నేతలు బుధవారం మండల తహసీల్దార్ ప్రేమ్‌రాజ్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గిరిజన నేతలు ఎం. రామునాయక్ మాట్లాడుతూ అడ్డదారిలో అక్రమంగా అనుమతుల పేరిట తవ్వకాలు చేపట్టడంతో గిరిజనులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. గ్రామపంచాయతీలోని 130 సర్వే నంబర్లు గల భూములలో అక్రమ మైనింగ్ తవ్వకాలు వెంటనే నిలిపేయకపోతే భారీ ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. అక్రమ మైనింగ్ తవ్వకాల వలన దాదాపు 200ల బోరు బావులు దెబ్బతినే ప్రమాదం ఉందని దీంతో వ్యవసాయం చేయలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మైనింగ్ తవ్వకాలు నిలిపేయాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌నాయక్, వి.వెంకటేష్ నాయక్, హనుమంతునాయక్, బాబునాయక్,భీముడునాయక్, హనుమంతునాయక్ పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న గిరిజన నేతలు

# ప్రతి గింజ కొనుగోలు చేస్తాం : సింగిల్‌విండో ఛైర్మన్

**పెద్దమందడి,ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రాథమిక సహకార సంఘాల ద్వారా ఏర్పాటు చేసిప వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీసుకువచ్చిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని పెద్దమందడి సింగిల్ విండో ఛైర్మెన్ విష్ణువర్ధన్ రెడ్డి, వైస్ ఛైర్మెన్ కుమార్ యాదవ్ లు వెల్లడించారు. బుధవారం పెద్దమందడి మండలం జగత్పల్లి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేస్తామని, రైతులు అధైర్య పడొద్దని ఆయన తెలిపారు. ఎలాంటి తరుగు తీయకుండా, అవకతవకలకు తావు లేకుండా కొనుగోళ్లు సజావుగా జరిగేలా చర్యలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తరుగు పేరుతో మోసం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గన్నీ బ్యాగుల కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అనంతమ్మ, ఎంపీటీసీ కురుమయ్య, ఉపసర్పంచ్ లత, సింగిల్‌విండో అధికారి సుధాకర్, సింగిల్‌విండో డైరెక్టర్ మన్యంకొండ, బీఆర్ఎస్‌నాయకులు గట్టు నాయుడు, మద్దిలేటి, బుచ్చన్న, చంద్రయ్య, విష్ణు, వెంకటేష్, మన్యం కొండ, తదితరులు పాల్గొన్నారు.


వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సింగిల్‌విండో ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

# మున్సిపల్ కార్యాలయం ఎదుట సీపీఎం ధర్నా

## గుడిసెలు వేసుకున్న చోట విద్యుత్, తాగునీరు సౌకర్యం కల్పించాలి : సీపీఎం నాయకులు


మున్సిపల్ కార్యాలయం ఎదుట మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

**అమరచింత,ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** ఇండ్లులేని పేదలు దుంపాయి కుంట లో గుడిసెలు వేసుకొని 8నెలలు గడుస్తున్న అధికారులు, త్రాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించడం లేదని తక్షణమే అధికారులు పనులు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి జీ.ఎస్.గోపి, బి.వెంకటేష్, ఆర్.ఎన్. రమేష్, ఎస్. అజయ్, బుచ్చన్న లు డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో కొత్తబస్టాండ్ నుండి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వ హించి మున్సిపల్ కమీషనర్ ఖాజా కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇండ్లు లేని పేదలకు 1997లో పట్టాలు పంపిణీ చేసిన ఇప్పటివరకు హద్దులు చూపడం లేదని,ఇప్పటికైనా అధికారులులబ్దిదారులకు హద్దులు చూపి విద్యుత్, తాగునీటి సౌకర్యంకల్పించాలని వారుఅధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు, లబ్దిదారులు పాల్గొన్నారు.

**మున్సిపల్ కమిషనర్ ఖాజా వివరణ:** ప్రభుత్వం 1997 లో పట్టాలిచ్చిన లబ్ది దారులు ఇంటి నిర్మాణం చేయకపోవడం వల్ల ప్రభుత్వం ఇచ్చిన పట్టాలు రద్దు చేసారని, అక్రమంగా గుడిసెలు వేసుకున్న వారిపై చర్యలు తీసుకుంటామని ,విద్యుత్, త్రాగునీరు సదుపాయం కల్పించే ప్రసక్తే లేదని ఆయన తేల్చి చెప్పారు. అలాగే విధులకు ఆటంకం కల్పిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.




# అకాలవర్షంతో నష్టపోయిన రైతులను ఆదుకోండి

**నారాయణపేట ప్రతినిధి,ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** గతకొద్ది రోజుల వ్యవధిలో అకాల వర్షాలు, ఈదురుగాలుల కారణంగా వరి పంటలు, మామిడి తోటలు చేతికొచ్చిన పంటలు నష్టపోయిన రైతులందరికి నష్టపరిహారం అందేలా చూడాలని మండల తహసిల్దార్, వ్యవసాయ శాఖ అధికారులను మక్తల్ నియోజకవర్గ నాయకులు, నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వాకిటి శ్రీహరి కోరారు. రైతులకు నష్టం జరుగుతుంటే చూస్తూ ఊరుకునే పరిస్థితి లేదన్నారు. అహోరాత్రులు కష్టపడి రైతులు వేసుకున్న పంటలు కోతదశలో ఉన్నాయని,ఇలాంటి సమయంలో వర్షాల వల్ల రైతులు నష్టపోయారు. ప్రతి దానికి అప్పులు తెచ్చి, రైతులు పంటలను వేసుకోవడం జరిగిందన్నారు. దీనివల్ల రైతులు మనోవేదనకు గురై అప్పుల బాధతో చాలామంది రైతు సోదరులు చనిపోతున్నారని అన్నారు.అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు వెంటనే ప్రతి ఎకరాకు 25 వేల రూపాయలు పంట నష్టపరిహారం అందించాలని, అదేవిధంగా కౌలు రైతులను దృష్టిలో పెట్టుకుని వారిని కూడా గుర్తించి, నష్టపరిహారం ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ పక్షాన విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మక్తల్ మండల కాంగ్రెస్ పార్టీసీనియర్ నాయకులు నరసింహులు, కట్ట సురేష్ కుమార్ గుప్తా, గొల్లపల్లి నారాయణ, గణేష్‌కుమార్, ఎ. రవికుమార్, ఎం.శ్రీనివాసులు, పి.రంజిత్‌కుమార్‌రెడ్డి, కున్సీ రాఘవేందర్, శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్యామ్, బోయ వెంకటేష్, అబ్దుల్ రెహమాన్, బహదూర్, మహ్మద్,గోవర్ధన్, ఓబులేష్, అనిల్,టి. కిష్టప్ప, కావలి రాజేందర్, దీపక్, శ్రీనివాసులు, కుర్మయ్య, కృష్ణయ్య, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


వినతి పత్రం సమర్పిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**మక్తల్,ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** మక్తల్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో 1996,97 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా ఉపాధ్యాయులు చందులాల్, సుజాత టీచర్ హాజరుకాగా, వారికి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఆ తర్వాత పూర్వ విద్యార్థులందరూ కలుసుకుని ఒకరి యోగక్షేమాలు మరొకరు తెలుసుకున్నారు. అనం తరం నిర్వహించిన ఆటపాటలలో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఆ తర్వాత పూర్వ విద్యార్థులు అందరు కలిసి పాఠశాలకు మైక్‌సెట్‌ను విరాళంగా అందజేశారు. పిఈటి పరంజ్యోతి, పద్మ, రాజేశ్వరి, హరిత, స్వప్న, లావణ్య, వనజ, లక్ష్మి, రాధ, రాజేశ్వరి,రజిని, అనిత, జయశ్రీ, కళ్యాణి, విజయశ్రీ, సంగీత, విజయలక్ష్మి, తులసిబాయి, వీణ, స్వప్నకుమారి పాల్గొన్నారు.



# అభాగ్యులకు అండగా సీఎం సహాయ నిధి

● నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు



బాధితుడికి సీఎం సహాయ నిధి చెక్కు అందజేస్తున్న ఎంపీ రాములు

**కల్వకుర్తి, ఏప్రిల్26 ప్రభాతవార్త:** ప్రమాదవశాత్తు గాయపడిన క్షతగాత్రులకు, అనారోగ్య భారిన పడి చికిత్సలు చేయించుకోలేని అభాగ్యులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్, ఎల్ఓసీని అందించి అభాగ్యులకు అండగా నిలుస్తోందని నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు పేర్కొన్నారు. కల్వకుర్తి మండలం గుండూర్ గ్రామానికి చెందిన బంగారయ్యకు మంజూరైన రూ.1లక్ష సీఎం సహాయ నిధి చెక్కును ఎంపీ రాములు బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రవేశ పెట్టి మహిళలకు, రైతులకు, క్షతగాత్రులను ఆదుకునేందుకుఆర్థిక సహాయంతో పాటుసదుపాయాలను కల్పించి వారి కుటుంబానికి భరోసా కల్పిస్తోందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, బాధిత కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

# ఓటర్ జాబితా పారదర్శకంగా ఉండే విధంగా కృషి చేయాలి

● నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ఓటర్ జాబితాలో తప్పులు లేకుండా పారదర్శకంగా ఉండే విధంగాకృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ సూచించారు. బుధవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు,ఆర్డీఓలు,తహసీల్దార్లతో ఎలక్టరోల్ తుది జాబితా రూపకల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరంలో సార్వత్రిక ఎన్నికలు జరుతున్నందున నాగర్‌కర్నూల్ జిల్లాలో ఓటరు జాబితా పారదర్శకంగా, ఎలాంటి తప్పులు లేకుండా తుది జాబితా రూపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.చివరి క్షణంలో ఓటరు జాబితాలో ఈ వ్యక్తి పేరు లేదని కానీ ఉన్న పేరును సమాచారం లేకుండా తొలగించరాదని లేదా ఒకే వ్యక్తి పేరున ఒకటి కంటేఎక్కువ ఓట్లు కలిగి ఉండటం, మరణించిన వారి పేర్లు సైతం ఓటరు జాబితాలో ఉండటం వంటివి లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకొని పకడ్బందిగా ఓటరు జాబితాను రూపొందించుకోవాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

ఎన్నికల నోటిఫికేషన్ పడిన తర్వాత బోగస్ ఓట్లు ఉన్నాయనే ఆరోపణలు వస్తుంటాయని, అలాంటి వాటికి ఆస్కారం లేకుండా చూడాలన్నారు. దీని కొరకు అన్ని రాజకీయ పార్టీలు వెంటనే తమ రాజకీయ పార్టీ తరుపున ప్రతి పోలింగ్ బూత్‌కు ఒక సహాయ బీఎల్ఓను నియమించి అట్టి జాబితాను తహసీల్దార్లకు అందజేయాలని కోరారు. తహసీల్దార్లు అన్ని పోలింగ్ బూతులకు బీఎల్ఓలను నియమించి బీఎల్ఓలకు సహాయ బీఎల్ఓలకు కలిపి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని ఆదేశించారు. తమ బూత్ స్థాయిలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటరు జాబితాలో పేరు నమోదు చేయించడం, మృతి చెందిన వారి పేర్లు తొలగించడం, ఏ విధంగా బూత్ ఓటరు అదే ఏరియాలో ఉండే విధంగా చూసుకోవడం,ఒకే వ్యక్తికి ఒకటి కంటే ఎక్కువ ఓట్లు ఉంటే తొలగించాలన్నారు. ఓటర్ జాబితాలో పేర్లు తొలగించే క్రమంలో తహసీల్దార్లు, డీటీలు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి దస్తావేజులు అన్ని సరి చూసుకున్నాకే తొలగించాలన్నారు. నియోజకవర్గ స్థాయిలో ప్రతి బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసుకోవాలని తహసీల్దార్లను ఆదేశించారు.కొత్తగా పేరు నమోదు చేసుకున్న వారందరికి ఎపిక్ కార్డు వచ్చే విధంగా చూడాలని తెలియజేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మోతిలాల్, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎన్నికల డీటీలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు ఉన్నారు.

# రైతులు ఆందోళన చెందవద్దు.. ప్రభుత్వం అండగా ఉంటుంది

● మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

**మక్తల్,ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు భరోసా ఇవ్వాలని విజ్ఞప్తి చేసిన కెటిఆర్ ఆదేశాలతో అన్ని మండలాలలో పర్యటిస్తున్నామని రైతులెవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రైతులందరిని ఆదుకుంటామని మక్తల్ నియోజకవర్గ ఎమ్మెల్యే చిట్టెం రామన్న అన్నారు. రాష్ట్రంలో కురుస్తున్న అకాల వర్షాల నేపథ్యంలో రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కె. తారకరామారావు తెలిపారన్నారు. దురదృష్టవశాత్తు రాష్ట్రంలో కురుస్తున్న వర్షాల వల్ల రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులను పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కష్టకాలంలో రాష్ట్రంలోని ప్రజా ప్రతినిధులంతా రైతులకు భరోసా ఇవ్వాలని కెటిఆర్ ఆదేశించారని అన్నారు. రాష్ట్రంలోని పార్టీ, ఇతర ప్రతినిధులు అంతా క్షేత్రస్థాయిలో పర్యటించి స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిస్థితులను పర్యవేక్షించడం



ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. మక్తల్ నియోజకవర్గంలో ఉన్న రైతులు ఆందోళన చెందవద్దని, వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.ఈ మధ్యనే కురిసిన అకాల వర్షాల నేపథ్యంలో ముఖ్యమంత్రి కెసిఆర్ స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు భరోసా ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రైతుల విషయంలో అత్యంత సానుకూలంగా ఉండే రైతు ప్రభుత్వమని రాష్ట్రంలో ఉందన్న రైతులు ధైర్యం కోల్పోవద్దని, రైతులకు అండగా కెసిఆర్ ఉన్నారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. రానున్న ఒకటి, రెండు రోజుల పాటు భారీ వర్షసూచన ఉన్న నేపథ్యంలో రాష్ట్రంలోని అధికారులంతా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని అధికార యంత్రాంగానికి ఆయన విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా నియోజకవర్గంలో ఉండే ప్రతి ఒక్క కార్యకర్త రైతులకు అండగా ఉండి రైతుల పంటల వివరాలు వ్యవసాయ అధికారులకు, తహసిల్దార్‌లకు పూర్తి వివరాలు సమర్పించే విధంగా సహకరించాలని వారు లీడర్లకు విజ్ఞప్తి చేశారు.

# మహిళల ఆరోగ్యంపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

● మహిళలు అరోగ్యంగా ఉండాలని ప్రత్యేక ఆరోగ్య మహిళా కేంద్రాలు ఏర్పాటు : గద్వాల జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

**గద్వాల ప్రతినిధి,ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** మహిళల ఆరోగ్యంపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, మహిళలు ఆరోగ్యంగా ఉండాలని, వారికి ప్రత్యేకంగా పలు వ్యాధులపై అవగాహన కల్పించడంతో పాటు చికిత్సలు నిర్వహించేందుకు ప్రత్యేక ఆరోగ్య మహిళా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. బుధవారం కలెక్టరేట్ చాంబర్‌లో జిల్లా వైద్యారోగ్య అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో మూడు ఆరోగ్య మహిళా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. క్యాతూర్, మల్దకల్,మానవపాడు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మహిళా వైద్య అధికారులు ఉన్నందున ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. మూడు కేంద్రాలను ప్రారంభించేందుకు వైద్యశాఖ సర్వం సిద్ధం చేసిందని తెలిపారు. మహిళల ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ప్రత్యేకంగా ఆరోగ్య మహిళ కేంద్రాలను ఏర్పాటు చేసి ఇందులో ప్రత్యేకంగా ప్రతి మంగళవారం మహిళలకు ప్రత్యేక ఓపిని ఏర్పాటు చేసి మహిళలకు సంబంధించి క్యాన్సర్ స్క్రీనింగ్,ఓరల్ కాన్సర్, బ్రెస్ట్‌కాన్సర్,డయాగ్నోస్టిక్, సూక్ష్మ పోషక లోపాలు, మూత్ర నాళిక ఇన్ఫెక్షన్స్, పిసిఓడి, ఎస్‌టిఐ, స్త్రీల శరీర బరువు నిర్వహణ తదితర మహిళల వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నారు. జిల్లాలోని అలంపూర్ మండలం క్యాతూర్, మానవపాడు, మల్దకల్ మండలాల్లో ప్రత్యేకంగా కౌంటర్లను ప్రారంభించేందుకు సిద్ధం చేసినట్లు తెలిపారు.ప్రతివారం కొంతమంది మహిళలు వచ్చేటా ఆశ,ఎఎన్ఎంలు సమీకరించాలని,రిజిస్టర్ ఏర్పాటు చేసి పేర్లు నమోదు చేసుకోవాలని అన్నారు. ప్రతి ఒక్క మహిళా ట్రీట్మెంట్ ద్వారా చెక్ చేసుకోవాలని అన్నారు. ప్రతి మంగళవారం ప్రత్యేకంగా మహిళా విభాగంచే ప్రత్యేక డాక్టర్‌లతో మహిళలకు పరీక్షలు నిర్వహించి చికిత్సలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు అయినట్లు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.శశికళ, డా. సిద్దప్ప, సూపరింటెండెంట్ డా.కిశోర్, డా.ప్రుశాలిని, డా.స్రవంతి పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

# పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో 33 కేవీ సబ్‌స్టేషన్ దగ్గర ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మత్తు కేంద్రం షెడ్‌ను బుధవారం ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి ప్రారంభించారు. అదే విధంగా బిజనపల్లి మండలంలోని గౌరారం నుంచి గౌరారం తాండ వరకు రూ.63లక్షలతో కొత్తగా బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. పాలెం గ్రామంలోని ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌లో కొత్తగా సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.26లక్షలు మంజూరయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

# నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న మోతిలాల్‌నాయక్

**వెల్దండ, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** వెల్దండ మండలంలో అకాల వర్షంతో పంట నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం వెంటనే స్పందించి ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోతిలాల్‌నాయక్ పేర్కొన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలతో చేతికొచ్చిన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, గతంలో కూడా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోలేదని, ఈ దఫా అయిన నష్టపోయిన రైతులను ఆదుకొని తమ చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. నేలరాలిన ప్రతి గింజను, పంటకు మద్దతు ధర ఇచ్చి ప్రభుత్వమే కొనుగోలు బాధ్యతలుతీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పుల్లయ్య,తిరుపతిరెడ్డి శివనాయక్, శ్రీనునాయక్‌తో పాటు తదితరులు ఉన్నారు.

# సివిల్‌సప్లై చైర్మన్‌కు ఘన సన్మానం



రవీందర్‌సింగ్‌ను సన్మానిస్తున్న జూలూరి రమేష్‌బాబు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జూలూరి రమేష్‌బాబు సివిల్ సప్లై చైర్మన్ రవీందర్‌సింగ్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా రవీందర్‌సింగ్‌ను శాలువాలతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు ఉన్నారు.

# బాధితులకు పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి

**కల్వకుర్తి, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలం బెక్కర గ్రామానికి చెందిన రామకృష్ణ కుమారుడు వివేక్ వేడీనీళ్లలో పడి తీవ్ర గాయాల పాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి బుధవారం వివేక్‌ను పరామర్శించి వైద్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులకు రూ.10వేల ఆర్థిక సహాయం అందించారు. వెల్దండ మండలం మర్రిగుంత తాండ విజేష్ సోదరుడు లాలు రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఎమ్మెల్సీ కసిరెడ్డినారాయణరెడ్డి పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ శంకర్‌నాయక్ పాటు బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

# నేడు భగీరథ మహర్షి జయంతి

**వనపర్తి ప్రతినిధి,ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** భగీరథ మహర్షి జయంతి గురువారం ఉదయం 10గంటలకు ఐడీఓసీ హాల్ లో జరగనుందని, ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ ముఖ్యఅతిథిగా పాల్గొని భగీరథ జయంతి కార్యక్రమం నిర్వహిస్తారని, వెనకబడిన తరగతులశాఖ అధికారి అనిల్ ప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు

**మహబూబ్‌నగర్‌లో :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం శ్రీ భగీరథ మహర్షి జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జి రవినాయక్ ప్రకటనలో తెలిపారు. ఈమేరకు జెడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 10.30గంటలకు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

# సకాలంలో ఎన్నికల పనులు పూర్తి చేయాలి

● నారాయణపేట జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**నారాయణపేట ప్రతినిధి,ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** బుధవారం హైదరాబాద్ నుండి ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి టి. రవికిరణ్‌తో కలిసి జిల్లా కలెక్టర్‌లతో ఓటరు జాబితాలో ఎఫ్ఎలసి, పిఈటీ తొలగింపు, ఓటర్ ఎపిక్ కార్డుల జారీ తదితర అంశాలపై నిర్వహించిన విడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్ అధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ మాట్లాడుతూ అసెంబ్లీ నియో జకవర్గాలకురిటర్నింగ్ అధికారులను నియమించేందుకు ప్రతిపాదనలను ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం, నిర్దేశించిన నమూనాలో మూడు రోజులలో సమర్పించాలని ఆయన తెలిపారు. జూన్ మాసంలో ఈవిఎం,వివి ప్యాట్ల ఎఫ్ఎల్‌సిలను నిర్వహించాలని, రాజకీయ పార్టీలకు ముందస్తు సమాచారం అందించి విడియో రికార్డింగ్ నిర్వహిస్తూ ఎఫ్ఎల్‌సి పూర్తి చేయాలని అన్నారు. ఎఫ్ఎల్‌సి నిర్వహణకు అవసరమైన సామాగ్రిని తీసుకునేందుకు ప్రతి జిల్లా నుండి నోడల్ అధికారిని నియమించాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణ కోసం ఉద్యోగులకు, సిబ్బంది శిక్షణ అందించేందుకు రాష్ట్ర,జిల్లాస్థాయి మాస్టర్ ట్రయినర్ల నియామక ప్రతిపాదనలు ఏప్రిల్ నెలాఖరు వరకు పంపించాలని అన్నారు. ఫొటో సిమిలర్ ఎంట్రీ కింద తొలగించిన ఓటర్ల వివరాలు, ఓటరు జాబితా నుండి తొలగించిన ఓటరుల వివరాలు మరోసారి పరిశీలన చేసుకోవాలనిఅన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ప్రతివారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం నిర్వహించి, మినిట్స్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆయన ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ఏప్రిల్ ఒకటి నాటికి 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటుహక్కు కల్పిస్తూ సప్లిమెంటరీ ఓటరు జాబితా విడుదల చేయాలని, జిల్లాలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలన, విచారణ చేపట్టి అవసరమైన పత్రాలను పొంది ఓటరుగా నమోదు చేయాలని తెలిపారు.గత అనుభవాలుదృష్టిలో ఉంచుకుని ఓటింగ్ తక్కువ నమోదైన ప్రాంతాల్లో ఓటరు అవగాహన కార్యక్రమాలను స్థానిక మాధ్యమాలు, కులబ్రుందాల ద్వారా వినూత్నంగా నిర్వహించేందుకు ప్రణాళిక తయారు చేసుకోవాలని, జిల్లాలో పట్టణ ప్రాంతాల్లో స్వీప్ యాక్టివిటీస్ కోసం ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన అన్నారు. స్వీప్ కార్యక్రమాల నిర్వహణ కోసం ప్రత్యేకంగా నోడల్ అధికారి నియామకం చేయాలని ఆయన తెలిపారు. ఎన్నికల సమయంలో ఎన్నికల వ్యవస్తపై



విడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

అనుమానాలు సృష్టించే విధంగా సామాజిక మాధ్యమల్లో వచ్చే తప్పుడు ప్రచారాలను గుర్తించి సకాలంలోవివరణలతో జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో సోషల్ మీడియా బృందాలను నియ మించాలని అన్నారు.గరుడయాప్‌లో ప్రతి బూత్‌స్థాయి అధికారి తప్ప నిసరిగా లాగిన్ అయ్యేలా ఈఆర్‌ఓలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 7.6 లక్షల ఇండ్లలో 6 కంటే ఎక్కువ ఓటర్లు ఉన్నారని, బూత్‌స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీ లించి మరోసారి తనిఖీ చేయాలని తెలిపారు. విడియో సమావేశం అనం తరం ఎఇఆర్‌ఓలతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఓటర్ల జాబితాపై పలు సూచనలు చేశారు. ప్రతి శనివారం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం నిర్వహించి ఓటరు జాబితాలో వచ్చే మార్పులు, ఎన్నికల కమిషన్ సూచనలు వివరించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో తొలగించబడిన ఓటర్లను మరోసారి పూర్తి స్థాయిలో క్షేత్ర పరిశీలన చేయాలని జిల్లా కల క్టర్ సూచించారు. ప్రతి దానికి ఫైల్ సిద్ధం చేయాలని, జీవించి ఉన్న ట్లయితే మళ్లీ ఫారం 6 ద్వారా నమోదు చేయాలని అన్నారు. గత సంవ త్సరం జనవరి 5 నుండి ఈసంవత్సరం 5వ తేదీవరకు ఓటరు జాబితా నుండి తొలగించబడినపేర్లను మరోసారి పరిశీలించాలని, వ్యక్తిగతంగా నిర్వహిం చాలని అన్నారు.ప్రతి పోలింగ్ స్టేషన్‌లో ఐదుశాతం కన్నా ఎక్కువ తొలగింపులు జరిగినచోమళ్లీ ఒకసారి పరిశీలించాలని అన్నారు.షిఫ్టింగ్ కేటగిరిలో వాటిని కూడాపరిశీలించాలని, మరణించిన వారైతే వారి బంధువుల నుండి రాత పూర్వక పత్రాలు సేకరిం చాలని సూచించారు. ఒకే కుటుంబంలో 20 లేదా10 మంది కన్నా ఎక్కువ మంది ఉంటే మరొకసారి వెరిఫై చేయాలని అన్నారు. ఎన్నికల మిషన్ నిబంధనల మేరకు ప్రతి పని ఫైల్‌లోనమోదు చేయాలని అన్నారు.సమావేశంలో కలెక్టరేట్ పరిపాలనా అధికారి నర్సింగ్‌రావు, తహసిల్దార్‌లు, కలెక్టరేట్ పర్యవేక్షకులు పాల్గొన్నారు.


# రాజ్యాధికారం దిశగా ముదిరాజ్‌లు అడుగులు వేయాలి

మొదటి పేజీ తరువాయి భాగం...

రాజ్యాధికారాన్ని చేపట్టాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ అత్యధికంగా ముదిరాజ్ కులస్థులకు జనాభా ప్రతిపాదికన స్థానిక సంస్థల్లో అవకాశం కల్పిస్తామని ఆయన అన్నారు. ముదిరాజ్‌లు, యాదవులు ఆత్మబంధువులని, వారి సంక్షేమానికి సీఎం కేసీఆర్ ఎన్నో కార్యక్రమాలు చేపట్టారని, కల్వకుర్తిలో ముదిరాజ్‌ల భవనం కోసం నా వంతుగా స్థలం, భవన నిర్మాణానికి సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ ముదిరాజ్‌లు ప్రతి ఒక్కరు విద్యపై మక్కువ చూపాలని, మన హక్కుల కోసం పోరాడటానికి అవకాశం ఉంటుందని, ముదిరాజ్ సంక్షేమ సంఘ భవనం కోసం సహకరిస్తానన్నారు. ముదిరాజ్‌లు ఐక్యంగా ఉండి పోరాడితేనే రాజ్యాధికారం దిశగా ముందుకు సాగుతారన్నారు. కేంద్ర ప్రభుత్వం ముదిరాజ్ సంక్షేమం కోసం భీమా, వ్యాపారానికి, వాహనాలను అందించారని జాతీయ మాజీ ఓబీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి అన్నారు. కార్యక్ర మంలో కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం, బీఆర్ఎస్‌నేత బృంగి ఆనంద్‌కుమార్‌తో పాటుముదిరాజ్ సంఘంనాయకులు తదితరులు ఉన్నారు.

# విజయవంతమైన శస్త్ర చికిత్స

▸▸ బాధితున్ని పరామర్శించిన మాజీ ఎంపిటిసి రాజిరెడ్డి



**కోయిల్‌కొండ,ఏప్రిల్ 26 ప్రభాతవార్త :** హైదరాబాద్‌లో ఉన్న లకిడి కపూల్ వాసవి ఆసుపత్రిలో సాయికుమార్ అనే మూడు సంవత్సరాల బాలుడికి డాక్టర్లు చేసిన శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించారని మాజీ ఎంపిటిసి రాజిరెడ్డి తెలిపారు. ఈసందర్భంగా మాజీ ఎంపిటిసి మాట్లాడుతూ, మండలంలో ఉన్న కొతలాబాద్ గ్రామానికి చెందిన సాయిపవన్ గొంతు దగ్గర కంతి కావడంతో అరుదైన చికిత్స కొరకు వివిధ ఆసుపత్రుల్లో చూపించిన ఫలితం లేకుండా పోయిందని తెలిపారు. లకిడికపూల్‌లో ఉన్న వాసవి ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయించడం జరిగిందని తెలిపారు. డాక్టర్లు కంతిని విజయవంతంగా తొలగించినందుకు సాయిపవన్ తల్లిదండ్రులు మాజీ ఎంపిటిసికి ధన్యవాదాలు తెలిపారు.

# ఘనంగా సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి జన్మదిన వేడుకలు

**వెల్దండ, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి జన్మదిన వేడుకలను వెల్దండ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ఆయనను శాలువాలు, గజమాలతో ఘనంగా సన్మానించి కేక్ కట్ చేసి తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మొదటగా అభిమానులు, కార్యకర్తలు భూపతి రెడ్డి నివాసానికి చేరుకొని శాలువాలతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, బీఆర్ఎస్ నాయకులు సంజీవ్‌కుమార్ యాదవ్, కోఆప్షన్ సభ్యులు ఎండీ.అలీమ్, యెన్నం కృష్ణారెడ్డి, బీఆర్ ఎస్ నాయకులు శశిపాల్‌రెడ్డి, గోళి శ్రీనివాస్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, తానేజ్, రాజుయాదవ్,ఆనంద్, జంగిలి నిరంజన్, జంగిలి యాదగిరి, అలీ,



యెన్నం భూపతిరెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

క్యాసారపు వెంకటయ్య,భయ్య మల్లయ్య, పూరి శివ, సుధాకర్‌రెడ్డి, రవి నాయక్,వెంకటేష్,ప్రభాకర్,తాండ్ర జంగయ్య,కాడూరాం, రంగయ్య, నాగయ్య, శ్రీశైలం,పూరి వజ్రలింగం, రాజు, బాలకృష్ణ, సమీర్ అహ్మెద్ షేక్, శ్రీను తదితరులు ఉన్నారు.

# అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి

**అమరచింత,ఏప్రిల్26 ప్రభాతవార్త:** అకాల వర్షాల వల్ల పంటలు నష్ట పోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని పీసీసీ రాష్ట్ర అధికార ప్రతి నిధి కేశం నాగరాజుగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు, ఈదురు గాలుల వల్ల వరి, మామిడి అనేక రకాల పంటలు రైతుల చేతికొచ్చే సమయంలో నష్టపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు అప్పులు చేసి ఆరుగాలం పండించిన పంట నేలరాలిపోయాయని, రైతులు మనోవేదనకు గురయ్యే అవకాశం ఉందని తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఎకరాకు రూ.25వేలు నష్టపరిహారం ఇవ్వాలని, రైతులు తీసుకున్న రుణాలను వెంటనే మాఫీ చేయాలని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు ఒకే విడత లో రూ.2లక్షల రుణాలు మాఫీ చేస్తుందని, రూ.500 గ్యాస్ సిలిండర్ ఇస్తుందని ఆయన తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సమస్యలు పరిష్కరించకుంటే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.



కేశం నాగరాజు గౌడ్, టీపీసీసీ అధికార ప్రతినిధి

# అఖిలపక్ష నిరుద్యోగ దీక్షలో మందడి సరోజ్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల నేతృత్వంలో టీ - సేవ్ లో భాగంగా అచలపక్ష నిరుద్యోగ దీక్ష ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా బుధవారం దీక్షలో వైఎస్ఆర్‌టీపీ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు మందడి సరోజ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా షర్మిలను కలిసి దీక్షకు సంఘీభావం ప్రకటించారు. 30లక్షల మంది యువత భవిష్యత్తుతో ఆటలు ఆడుతున్న రాష్ట్ర ప్రభుత్వంపై పార్టీ ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. దీక్షలో దేవరకద్ర నియోజకవర్గ నాయకులు మొల్ల జహంగీర్, చింతకాయల శివకుమార్,నయీంభాయ్,కాట్రావత్ ఆనంద్‌నాయక్ పాల్గొన్నారు.



దీక్షలో షర్మిలతో కలిసి పాల్గొన్న మందడి సరోజ్‌రెడ్డి